# విమల తొడిగిన ఉంగరం

"భాస్కరభట్ల"

కథానిక

కారు గాలితో పోటీలు పడుతున్నది.

రోడ్డుకిరువేపులా చెట్లు వెనక్కు పరుగెడుతున్నాయి. కారు వెనకాల దుమ్ము చిన్నచిన్న మేఘాలుగా లేచి గతాన్ని మరుగుపరుస్తున్నది. విమలకు కాలగమనం ఆగినట్లనిపించి తలెత్తి పరిసరాల్ని పరికించింది.

కారులో తన కుడిపక్కన మధు, ఎడమవేపున సుధ కూర్చున్నారు మిగిలిన స్నేహితులు, పూర్వ జన్మవాసనలవలె తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నారు. గమ్యస్థానం సమీపిస్తున్నది. కారులో మొదటి ఉద్వేగం చల్లారింది, కబుర్లు ఆగిపోయినాయి. ఆ ప్రశాంతతలో. ఎందుకో విమల హృదయం సంతోషంతో వెల్లివిరిసింది.

ఆ రోజు విమల పుట్టినదినం. మిత్రులంతా కలిసికార్‌లో గండీపేటకు వెడుతున్నారు.

విమల ఓరచూపుతో మధుని చూచింది. మధు చూపులు తన చూపులతో కలసేసరికి, సిగ్గుతో తల వాల్చుకుంది. కారు, మంచుతెరల్ని కప్పుకొని మందంగా నిద్రపోతున్న ధూళిని కుదుపుతో లేపుతున్నది.

విమల వెనక్కితిరిగి, ధూళివాడలో తన ఇల్లు గుర్తించినట్టుగా చూసింది.

విమల ధూళిముసుగులో సూర్యుడు నారింజ పండు రంగులో భూమిలోంచి పైకితేలడం గమనించింది. ఎందుకో పైకితేలిన సగం సూర్యుడిని, తొనలుతొనలుగా విడదీసి, విమలకి గుటుక్కున మింగేదామనిపించింది. విమల తన శరీరమంతటా వ్యాపిస్తున్న అరుణకాంతుల్ని అదిమిపట్టి, ఒకమాటు సుధని చూచింది.

సుధ చూపులు ఎక్కడో దూరంగా శూన్యంలో వాలుతున్నాయి. "ఇంకా ఎంత దూరముంది?" లక్ష్మి విసుగుతో ప్రశ్నించింది. "రెండుమైళ్లు"— సుధ పరధ్యానంగా జవాబు చెప్పింది. "అబ్బా! ఇంకా రెండుమైళ్ళే!" లక్ష్మి విసుగు పునరుక్తి దోషంగా ధ్వనించింది.

"ఆ కాస్తా ఓపికపట్టలేవూ!" సరళ ఒక విసురు విసిరింది.

"కారులో కూర్చున్నప్పటినించీ, లక్ష్మికి తినుబండారాలపైన ధ్యాసే—ఏదైనా కాస్త తినడానికి పెట్టండి, ఇంక ఎంతదూరమైనా ఓపికపడుతుంది."

ఇందిర నిందారోపణ కొద్దిగా కఠినంగాతోచింది విమలకి. ఇందిరకి ఎందుకో మనుషులపైన నీలాపనిందనలు వేయడమంటే యిష్టం.

సుధ చాలా చెడ్డదనీ, మితిమీరి ప్రవర్తిస్తున్నదనీ, కాలేజీ కుర్రవాళ్ళతో ఒంటరిగా సినిమాలకు వెళ్ళుతుందని, ఇందిర తనకు చెప్పింది.

కాలేజీలో కూడా, ఎందుకో సుధని గూర్చి ఇల్లాంటి కబుర్లే ప్రచారంలో ఉన్నాయి.

సుధ మద్రాసునించి వచ్చి, బి.ఏ.లో చేరింది. ఇందిరే తనకి మొదట సుధని పరిచయం చేసింది. పరిచయమై ఇంకా సంవత్సరమైనా కాలేదు-సుధ తన క్లాసుమేటు కాకపోయినా, ఎందుకో ఆమె అంటే తనకి యిష్టం-తనకేకాదు, కాలేజీలో ఆడపిల్లలందరికి కూడా ఆమె అంటే ఎంతో యిష్టం.

"ఒక్క ఆడపిల్లలకనేం ఖర్మం, మగపిల్లలందరికీ కూడా యిష్ట"మని ఇందిర తనతో వాదించడం విమలకి చప్పున జ్ఞాపకమొచ్చింది.

కారు ధూళిమేఘాలు సృష్టిస్తూ పరుగెడుతున్నది. ఇంతలోకే గండీపేట వచ్చేసింది. చెరువు కనపడడంతోనే కారు కొత్తప్రాణాల్ని పోసుకున్నది.

"పార్కుకి వెడదా"మంది సుధ.

"నీతో షికార్లుకొట్టడానికి అక్కడ ఎవరైనా దొరికితే దొరకవచ్చు" అంది ఇందిర ఉడుకుమోతుగా.

మధుని వదిలేసినందుకు విమల ముప్పైమూడుకోట్ల దేవతలకూ కృతజ్ఞత తెలుపుకుంది.

"పార్కులో జనం ఎక్కువగా ఉంటారు, ఇంకెక్కడికైనా వెళదాం" అంది లక్ష్మి.

"జనమంటే పాపం లక్ష్మికి చాలా భయం" అని అప్పటివరకు ఏమీ మాట్లాడని కమల అంది.

"జనమంటే కమలకి కూడా ఎంతో సరదా" లక్ష్మి విసిరికొట్టింది—సుధ, లక్ష్మిని కొరకొర చూచింది.

"రహదారి బంగళాకివెళ్ళదా"మన్నాడు మధు.

"మేమంతా వస్తే, మీకు అక్కడ ఏకాంతం లభించదు"అంది ఇందిర.

విమల చెక్కిళ్ళు ఎర్రబారాయి.

కారు రహదారి బంగళా దారిపట్టింది.

సామానులు దించి, ఫలహారాలుచేసి, అందరూ జంటలు జంటలుగా పార్కుకి బయల్దేరారు. కమల, సుధ, అందరికన్నా ముందు వెడుతున్నారు. లక్ష్మి, ఇందిర, ముందున్న జంటని కలుసుకోవడానికి పోటీలుపడి పరుగెత్తుతున్నారు. విమల మధులు చివరకి మిగిలారు.

"ఆ పరుగులేమిటి? మేము కూడా వస్తున్నాం, కాసేపు ఆగండి" అని వెనకనించి విమల అరిచింది.

"మీ ఇద్దరిమధ్యా మేమెందుకు?"అన్న ఇందిర మాటల్ని గాలి వెనక్కి మోసుకొచ్చింది.

మధు ముందు నడుస్తున్నాడు. విమల అతని వెనకాల అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నది.

"ఏఁ, వెనకబడుతున్నావే?" అన్నాడు మధు.

ఎందుకో విమలకి, అతని పక్కన నడవడానికి సిగ్గేసింది. "వస్తున్నానే!" అంది విమల క్లుప్తంగా. విమల మధుకి సమానంగా నడవలేక పోయింది. ఏదో నెపంతో వెనకబడి మధు ఆగిపోవడంతో దారిపొడుగునా అతన్ని కలుసుకోవడం మొదలెట్టింది.

తిరిగి విమల వెనకబడింది. మధు వెనక్కితిరిగి ఆగిపోయాడు. విమల తనని సమీపించడంతోనే, "Hearty Birthday Greetings" అని, విమలని ఒక చేత్తో దగ్గరికి లాక్కుని, రెండవ చేతిలో జేబులోంచి ఉంగరంతీసి, ఎడమచేతి చిటికెన వేలుకి పెట్టాడు. విమల హృదయంలో నందనవనం విరిసింది. చెట్లు పూచాయి. సెలయేళ్లు గంతులు వేసాయి. పక్షులు కిలకిలా కూజితాలు చేసాయి. లేళ్ళు పరుగెత్తాయి. నెమళ్ళు, పురివిప్పి నాట్యం చేసాయి. వెనకాముందులతో మధూ విమలా పార్కుకి చేరుకున్నారు. మధు లోపలికి వెళ్ళండే తడవుగా కమల పరుగెత్తుకొనివచ్చి "దొంగ దొరికావు" అని గట్టిగా మధుని పట్టుకుంది. దాగుడు మూతలతో మధ్యాహ్నమైంది. పార్కుకి టిఫిన్‌క్యారియర్లు డ్రైవర్‌తో తెప్పించి వేపచెట్టుక్రింద అందరూ అన్నాలకి కూచున్నారు. ఎవరికిష్టమొచ్చింది వారు వడ్డించుకుంటున్నారు. యిష్టమొచ్చింది తింటున్నారు. సుధ అందరికీ భోజనం మధ్యలో కావలసిన వస్తువులు వేస్తున్నది. భోజనాలు ముగించి, తీపితింటూ, అందరూ విమలకి Birthday greetings Chorus గా చెప్పి, చేతులు కడుక్కొని నీళ్ళు తాగడానికి చెరువుకి పరుగెత్తారు.

తిరిగి వచ్చేసరికలా డ్రైవర్ గిన్నెలు, ప్లేట్లూ తీసి వేపచెట్టుక్రింద పెద్ద జంపుఖాన పరిచాడు. సుధ, కమల పరుగెత్తుకొచ్చి, జంపుఖానపైన పడుకున్నారు. లక్ష్మి, ఇందిర చీట్లాడుదామని సుధ, కమలల్ని లేపుతున్నారు. మధు, గ్రామఫోన్‌కికీ ఇచ్చి రికార్డులు పెడుతున్నాడు. విమలవచ్చి సుధ, కమలల మధ్య పడుకుంది.

విరహవేదనతో గ్రామఫోన్ మూలుగుతున్నది. కమల నిద్ర నటిస్తున్నది.

మిగిలిన నలుగురూ చీట్లాటలో నిమగ్నమైనారు. గ్రామఫోన్ విరహవేదనల్ని ఆపివేసినసంగతి మిత్రులెవరూ, చీట్లాటలో గమనించలేదు.

"కమలేదీ"అంది సుధ, క్లబ్సు కింగ్ మీద క్వీన్‌ని విసురుతూ...

అందరూ కమల పడుకున్న వేపుచూచారు. కమల అక్కడలేదు. గ్రామఫోన్‌వేపు అమాంతంగా ఎనమిదికళ్లు మళ్ళాయి! గ్రామఫోన్ తిరగడంలేదు. మధు కూడా అక్కడలేడు.

"వీళ్ళిద్దరు ఎక్కడికి వెళ్ళినట్టు?" అంది ఇందిర.

"ఎక్కడికి వెడుతారు. ఇక్కడే ఎక్కడో వుంటారు" అంది లక్ష్మి.

"మధు, సిగరెట్ల కోసం వెళ్ళి ఉంటాడు, కమల తోడుగా వెళ్ళివుంటుంది." అని విమల అనాలోచితంగా సమాధానం చెప్పింది. తిరిగి ముక్కలపైన ముక్కలు పడుతున్నాయి.

ఆట ముమ్మరంగా సాగుతున్నది.

గంటైంది. ఇంకా రాజులూ రాణీలూ దొర్లుతూనే వున్నారు. రెండు గంటలైంది. ఆట సాగుతూనే వుంది. నాలుగైవుంటుంది. డ్రైవర్ టీ తీసుకొచ్చాడు. టీ కనపడడంతోనే తిరిగి కమలా మధులు జ్ఞాపకమొచ్చారు.

డ్రైవర్ కప్పుల్లో టీ పోశాడు- నలుగురికీ నాలుగు కప్పులందించాడు.

విమల టీ చప్పరిస్తో, కమల, మధులు ఎక్కడికి వెళ్ళారో చూడమని డ్రైవర్‌తో చెప్పింది.

టీ తరువాత ఆట రక్తికట్టలేదు. నలుగురూ ముక్కలుపారేసి,జంపుఖానాపై మేనులువాల్చారు.

సుధ, విమల ఒకచోట— కొద్ది ఎడంగా, వారికి అభిముఖంగా లక్ష్మి, ఇందిరలు పడుకున్నారు. విమల, సుధలు ఆటలో ఓడారు. లక్ష్మి, ఇందిరలు గెలిచారు.

మధు, కమలా ఎక్కడా కనపడలేదని డ్రైవర్ వచ్చి చెప్పాడు.

విమల జంపుఖానాపైనించి లేచి 'నేను వెతుకొక్కొస్తా'నని బయల్దేరింది.

మిగిలిన ముగ్గురూ ఏమీ మాట్లాడలేదు. జంపుఖానాపైనదొర్లుతూ ఏవో కబుర్లలోపడ్డారు.

విమల అంతా వెతికింది. ఎక్కడా కమల, మధులు కనపడలేదు. విసిగి మనస్సులో ఏదో మెదిలి చేతులు కడుక్కున్న చోటికి దారి తీసింది.

కనుచూపు మేరలో మధు కమలలు, చెరువు నీళ్ళలో కాళ్లు ఆడిస్తూ, ఒకరి కౌగిలిలో ఒకరు కనపడ్డారు. విమల ముందుకు వెళ్ళలేక పోయింది. వెనక్కి తిరిగి వెళ్ళడానికి కాళ్ళు ఆడక నిలుచున్న చోటే నిశ్చేష్టురాలై నిలబడి పోయింది.

చిటికెనవేలు ఉంగరం ఎండకి జిగేలున మెరిసింది. విమల చేతినించి ఉంగరం తీసింది. కొంగులో జాగ్రత్తగా కట్టుకుంది— కాళ్ళీడ్చుకుంటూ వచ్చి, ఎక్కడా కనపడలేదని మిత్రులతో బొంకింది.

ఎక్కడా కనపడలేదని డ్రైవర్ చెప్పిన మాటలు గుర్తుకువచ్చి విమలకి కళ్ళనీళ్ళ పర్యంతమయింది. జంపుఖానామీద బోర్లపడుకొని నిద్ర నటించింది. నిద్రపట్టలేదు. దూరంగా చెట్టునీడలో పడుకుని, ఒకకుక్క శ్వాసతీస్తో, పొడుగాటి నాలుకమీదుగా జొల్లుకారుస్తున్నది. చీకూచింతా లేకుండా పడుకొనివున్న కుక్కని చూస్తో విమల కొంతకాలం వెళ్ళబుచ్చింది. తరువాతలేచి, ఇటూ అటూ తిరుగుతున్నట్టు నటించి డ్రైవర్‌కు చెప్పి రహదారి బంగళాకు ఎవరికీ తెలియకుండా బయల్దేరింది. అడుగొక మైలుగా నడకసాగించి, ఎల్లాగో రహదారి బంగళాకి వచ్చిపడింది. సాయంకాలం మిత్రులంతా రహదారి బంగళాకు తిరిగి వచ్చారు.

"ఎందుకు తిరిగి వచ్చేసావు?" అని కమలతప్ప అందరూ అడిగారు. మధూ అడిగాడు.

"సామాను సర్దడాని"కని అందరితో బొంకింది- మధుతోకూడా బొంకింది.

నిజానికి సామానంతా సర్ది ఉంది.

మిత్రులంతా కారులో కూర్చున్నారు- విమల కోసం మధుపక్కన చోటువుంచారు. విమల కారు ఎక్కి, సుధని మధుపక్కకితోసి, ఆమె పక్కని కూర్చుంది.

కారు వచ్చినదారి పట్టింది.

వర్తమానం, ధూళి మేఘాల్లో మరుగుపడి గతాన్ని విమల కళ్ళముందు నిలుపుతున్నది.

ఎందుకో విమల హృదయంలో ఆరిపోవడానికి ముందు దీపం వెలిగినట్లు, ఒకభావం జిగేలుమంది.

కమల, విమలకి ఇంకొకపక్కన వుంది.

విమల కొంగులోంచి ఉంగరం తీసి, కమల చిటికెనవేలుకు పెట్టింది. వేలికి ఉంగరం చక్కగా అమరింది.

సూర్యుడు పాలిపోయిన మొహంతో, కారు వెనకాల చెరువులో ఇంకుతున్నాడు. చీకట్లు క్రమంగా భూగోళంపైన వాలుతున్నాయి.

---

సినిమాహాల్లో స్నేహితురాలిని చూసి, "మీ ఆయన కొత్త సూటు కుట్టించుకున్నట్లుందే?" అంది యువతి. "లేదు,పాతసూటే!" అంది స్నేహితురాలు.

"ఐతే ఆయనలో నాకేదో మార్పు కనిపిస్తూంది."

"కొత్త భర్త."